# సమయ స్ఫూర్తి




ఆ రోజు శనివారం అన్న విషయం జ్ఞాపకం లేదు ప్రసాద్‌కి.

ఆరోజు తప్పనిసరిగా బ్యాంకు డ్రాఫ్ట్ ఒకటి కట్టాలి.

సరిగ్గా పన్నెండు గంటలకు– ఆరోజు శనివారమనీ, బ్యాంకు ట్రాన్సాక్షన్స్ 12:30కి అయిపోతాయనీ జ్ఞాపకం వచ్చింది. ఆ వెంటనే సోమవారం సెలవన్న విషయమూ స్ఫురణకి వచ్చింది.

ఆదరాబాదరాగా స్కూటరెక్కి బయలుదేరాడు. ట్రాఫిక్‌ని తప్పించుకుంటూ, ఆటోమాటిక్ సిగ్నల్స్ దగ్గర తప్పనిసరిగా ఆగుతూ వెళ్తున్నాడు.

బ్యాంక్ ఇంకా రెండు ఫర్లాంగుల దూరం ఉందనగా... స్కూటర్ లైసెన్సులు చెక్ చేస్తూ కనిపించారు పోలీసులు.

వాళ్ళని చూడగానే గుండె ఝల్లుమంది ప్రసాద్‌కి. హడావుడిలో లైసెన్స్ వెంట తెచ్చుకోవడం మరిచిపోయాడు. అప్పటికే పన్నెండూ ఇరవై అయింది. పోనీ.., స్కూటర్‌ని వెనక్కి తిప్పి మరో దారి వెంట వెళ్దామంటే- అది చుట్టు దారి. పైగా... వన్ వే ట్రాఫిక్!

ఏం చెయ్యాలో తోచక కంగారు పట్టుకుంది ప్రసాదుకి. ఒక్క పోలీసు పట్టుకుంటే కాస్త చెయ్యి తడి చేస్తే ఊరుకుంటాడు. కాని, నలుగురైదుగురు పోలీసులు, ఒక ఇన్‌స్పెక్టరూ కలిసి స్కూటర్లని, మోటర్‌సైకిళ్లని చెక్ చేస్తున్నారు. అందువల్ల లంచం ప్రసక్తే లేదు. ఆరోజు డ్రాఫ్ట్ కట్టకపోతే చెప్పలేనంత ఇబ్బంది అవుతుంది. పోనీ... మరో బ్యాంక్‌కి వెళ్దామా... అంటే దగ్గరలో వేరొకటి లేదు.

పేవ్‌మెంట్ పక్కనే స్కూటర్ ఆపి కంగారుగా ఆలోచిస్తున్నాడు ప్రసాద్.

పక్కనే ఉన్న క్లాత్ షాప్ నుంచి ఒక పోలీస్ ఇన్‌స్పెక్టరు బయటికి వస్తున్నాడు.

ఆయన చార్మినార్ దగ్గర కంట్రోల్‌రూంలో పనిచేస్తున్న విషయం తనకి తెలుసు.

వెంటనే ప్రసాద్ మస్తిష్కంలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

వెంటనే "హలో బ్రదర్! బాగున్నావా?" అని అడిగాడు బాగా పరిచయం ఉన్న స్నేహితుడిలా. ఆ ఇన్‌స్పెక్టర్ ఒక్కక్షణం ఇబ్బందిగా చూసి, వెంటనే నవ్వుముఖం పెట్టి, "ఆ... బాగానే ఉన్నాను" అన్నాడు.

"ఎందాక వెళ్తున్నావు? డ్యూటీకేనా?" అన్నాడు ప్రసాద్.

"అవును"

"చార్మినార్ దగ్గరిదేగా?"

"అవును"

"అయితే కమాన్. నేనూ అటే వెళ్తున్నాను. మీ ఆఫీసు దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు ప్రసాద్. ఆ వ్యక్తి తన వెహికిల్ ఉందని కూడా అనకుండా "సరె..." అంటూ ఆయన ఇబ్బందిగానే వెనక కూర్చున్నాడు.

ప్రసాద్ తలెత్తి పోలీసుల ముందునుంచే జామ్మని స్కూటర్ నడుపుకుంటూ వెళ్లాడు.

వెనక పోలీసు అధికారి ఉండడంతో ఎవరూ ఆపలేదు. ఆయన్ని దారిలో డ్రాప్ చేసి నవ్వుకుంటూ బ్యాంకుకు వెళ్లాడు ప్రసాద్.

- ఆంధ్రప్రభ వార పత్రిక... *29 జూలై '87*